క్లుప్తంగా

మార్కెట్ ఏర్పాటు నిర్ణయం విరమించుకోవాలి


మాట్లాడుతున్న ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోపిచంద్

దేవరకొండ: పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఆవరణలో సమీకృత మార్కెట్ ఏర్పాటు నిర్ణయాన్ని విరమించుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యలమల గోపిచంద్ అన్నారు. సమీకృత మార్కెట్ ఏర్పాటు ప్రయత్నాలను విరమించుకోవాలని కోరుతూ ఏబీవీపీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరాహార దీక్షను ఉద్దేశించి సోమవారం ఆయన మాట్లాడారు. ఇప్పటికైనా శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, ఎమ్మెల్యే రవీంద్రకుమార్ స్పందించి మార్కెట్ ఏర్పాటు నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో చిలువేరు మానస, తగుల నాగలక్ష్మి, లింగాల రాకేశ్, కటికర్ల ఈశ్వర్, ఎం. సాయినాథ్, నెల్లికంటి గోపి, ఎం. అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

జనాభా దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలి


మహాధర్నా కరపత్రాన్ని విడుదల చేస్తున్న టీఎమ్మార్పీఎస్ నాయకులు

త్రిపురారం: రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు మాదిగలకు జనాభా దామాషా ప్రకారం వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లు కేటాయించాలని టీఎమ్మార్పీఎస్ నాగార్జునసాగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి మొండికత్తి అశోక్ డిమాండ్ చేశారు. సోమవారం త్రిపురారం మండల కేంద్రంలో నిర్వహించిన టీఎమ్మార్పీఎస్ సమావేశంలో 30న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహాధర్నా కరపత్రాన్ని విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మాదిగ ఉపకులాలు తరలివచ్చి ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సైదులు, బొజ్జ సోమయ్య, కుమ్మరి విజయ్, కొండేటి నాగయ్య, బోయ రవి, మొండికత్తి శేఖర్ పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి

త్రిపురారం: గ్రామాల్లో పనిచేస్తున్న మిషన్ భగీరథ కార్మికులకు ప్రభుత్వం కనీస వేతనం అమలు చేయాలని భగీరథ కార్మికులు డిమాండ్ చేశారు. సోమవారం త్రిపురారం మండల కేంద్రంలో నిర్వహించిన భగీరథ కార్మికుల సంఘం సమీక్ష సమావేశంలో పలువురు మాట్లాడుతూ.. మంగళవారం ఈఎన్‌సీ కార్యాలయం ముందు జరిగే మహాధర్నాకు కార్మికులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు కరపత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో దుర్గారావు, అవిరెండ్ల సైదయ్య, చందు, బొర్రయ్య, మంత్రి శ్రీను, పోలె శ్రీను, సతీష్, నాగయ్య, వినోద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ఆసక్తి పెంచేందుకే పఠనోత్సవం

కొండమల్లేపల్లి: విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించేందుకే పఠనోత్సవం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర పరిశీలకుడు శేషుకుమార్ అన్నారు. కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం పఠనోత్సవ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకుడు విశాల్ నాయుడు, ఎంఈఓలు మాతృనాయక్, సామ్య నాయక్, వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం చీన్యనాయక్, వాసికర్ల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

డిండి మండలంలో..

డిండి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో స్టేట్ కంట్రోల్ ఆఫ్ రీసెర్చ్ టీం ఆధ్వర్యంలో పఠనోత్సవ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రీసెర్చ్ బృందం సభ్యుడు శశి మాట్లాడుతూ.. చదువులో వెనుకబడిన విద్యార్థులకు పఠనోత్సవం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ సామ్యా నాయక్, హెచ్‌ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు, ఎంపీటీసీ వెంకటయ్య పాల్గొన్నారు.

గడియగౌరారం జెడ్పీహెచ్‌ఎస్‌లో..

చింతపల్లి: మండల పరిధిలోని గడియగౌరారం జెడ్పీహెచ్ఎస్‌లో సోమవారం పఠనోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పర్యవేక్షణ బృందం సభ్యుడు మూర్తి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉజ్జిని లక్ష్మీ, హెచ్‌ఎం జంగయ్య, ఎస్ఎంసీ చైర్మన్ తంగెళ్ల శ్రీనివాస్, సదాలక్ష్మి, భాగ్యలక్ష్మి, సైదులు, కృష్ణ, సుమలత పాల్గొన్నారు.


కొండమల్లేపల్లి: విద్యార్థితో పాఠం చదివిస్తున్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయులే ఇన్‌చార్జిలుగా..

- పెద్దవూర మండలంలో ఎనిమిది జెడ్పీహెచ్ఎస్‌లకు ఒక్కరే జీహెచ్‌ఎం
- ఏడు జీహెచ్‌ఎం పోస్టులు ఖాళీ
- ఉపాధ్యాయులకు అదనపు బాధ్యతలు
- 67 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ
- ఇబ్బందులు పడుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


పెద్దవూర జెడ్పీ ఉన్నత పాఠశాల

పెద్దవూర: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడుల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునేందుకు ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులకు సదస్సులు, శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని, అంతేకాకుండా ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన చేస్తున్నామని ప్రభుత్వం గొప్పగా చెబుతుంది. కానీ పాఠశాలల నిర్వహణ బాధ్యతలు చూడాల్సిన ప్రధానోపాధ్యాయులు లేకపోవడంతో క్షేత్రస్థాయిలో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. హెచ్‌ఎం పోస్టులు ఖాళీ అయ్యి ఏళ్లు గడుస్తున్నా నేటికీ భర్తీ చేయకపోవడంతో ఉపాధ్యాయులపై అదనపు భారం పడుతుంది.

మండలంలో ఒకే ఒక్కరు..

పెద్దవూర మండలంలో మొత్తం 8 జెడ్పీ ఉన్నత పాఠశాలలు(పెద్దవూర, పులిచర్ల, పెద్దగూడెం, చలకుర్తి, వెల్మగూడెం, మోడల్ స్కూల్‌–పైలాన్‌కాలనీ, ప్రభుత్వ ఉన్నత పాఠశాల–హిల్‌కాలనీ, బాలికల ఉన్నత పాఠశాల–హిల్‌కాలనీ) ఉన్నాయి. వీటిలో కేవలం పెద్దవూర జెడ్పీహెచ్ఎస్‌లో మాత్రమే గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు ఉన్నారు. మిగిలిన ఏడు జెడ్పీహెచ్ఎస్‌లకు జీహెచ్‌ఎం పోస్టులు ఖాళీగా ఉండటంతో ఆయా పాఠశాలలకు చెందిన స్కూల్ అసిస్టెంట్లు ఇన్‌చార్జి హెచ్‌ఎంలుగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. వీరు తమ సబ్జెక్టులను బోధిస్తూనే పాఠశాల నిర్వహణ బాధ్యతలు చేపడుతున్నారు. దీనికి తోడు ప్రతి హెచ్‌ఎంకు కాంప్లెక్స్ పరిధిలో పది నుంచి పదిహేను పాఠశాలలను పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. ఒకవైపు హెచ్‌ఎంగా, కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలలపై పర్యవేక్షకుడిగా, తమ సబ్జెక్టును విద్యార్థులకు బోధించాల్సిన పరిస్థితి ఉంది. దీంతో అదనపు పనిభారం పడి బోధనాపరంగా ఆయా సబ్జెక్టులకు సరైన న్యాయం చేయలేకపోవడంతో విద్యార్థులు నష్టపోవాల్సి వస్తుంది.

భర్తీకి నోచుకోని జీహెచ్‌ఎం పోస్టులు

గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల పోస్టులను గత ఎనిమిది సంవత్సరాలుగా ప్రభుత్వం భర్తీ చేయడం లేదు. ఉపాధ్యాయుల ప్రమోషన్ల ప్రక్రియ చేపట్టకపోవడం, ఉన్న జీహెచ్‌ఎంలు పదవీ విరమణ పొందుతుండటంతో నెల నెలకు జీహెచ్‌ఎంల పోస్టుల ఖాళీలు పెరుగుతూ వస్తున్నాయి. ఇదిలా ఉండగా ఉన్నత పాఠశాలల్లో కేవలం స్కూల్ అసిస్టెంట్లు మాత్రమే విద్యాబోధన చేస్తారు. ఇన్‌చార్జి హెచ్‌ఎంగా స్కూల్ అసిస్టెంటే ఉంటుండడంతో బాధ్యతల విషయంలో తోటి ఉపాధ్యాయుల పట్ల కఠినంగా వ్యవహరించలేని పరిస్థితులు ఉన్నాయి. దీనికి తోడు ప్రమోషన్ల ప్రక్రియ చేపట్టకపోవడంతో చాలా మంది స్కూల్ అసిస్టెంట్‌లు గెజిటెడ్ హెచ్‌ఎంలు కావాలన్న కల నెరవేరకుండానే పదవీ విరమణ పొందుతున్నారు. మండల విద్యాధికారి పోస్టు సైతం గత పది సంవత్సరాలుగా ఖాళీగా ఉండటం గమనార్హం. దీంతో పెద్దవూర, అనుముల, నిడమనూరు మూడు మండలాలకు ఒక్కరే ఎంఈఓగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

ఉపాధ్యాయ పోస్టులు సైతం ఖాళీ..

మండలంలో 55 ప్రాథమిక, 5 ప్రాథమికోన్నత, 8 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. మొత్తం 145 ఎస్జీటీ పోస్టులకు గాను 32 పోస్టులు, ఉన్నత పాఠశాలల్లో మంజూరైన స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 117కు గాను 32 ఖాళీగా ఉన్నాయి. 8 ఎల్ఎఫ్ఎల్‌హెచ్‌ఎం పోస్టులకు గాను మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

ఉన్నతాధికారులకు నివేదిస్తున్నాం



మండలంలోని 7 ఉన్నత పాఠశాలల్లో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటితో పాటు పలు ఉపాధ్యాయుల పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయి. ఈ విషయమై ఉన్నతాధికారులకు నివేదిస్తూనే ఉన్నాం. కానీ ప్రధానోపాధ్యాయుల నియామకాల ప్రక్రియ జరగకపోవడంతో ఆయా పాఠశాలల్లో సీనియర్ స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులకు ఇన్‌చార్జి హెచ్‌ఎంలుగా అదనపు బాధ్యతలు ఇచ్చి పాఠశాల నిర్వహణను కొనసాగించాల్సి వస్తుంది.

– లావూరి బాలు, ఎంఈఓ, పెద్దవూర

డ్రగ్స్‌తో బంగారు భవిష్యత్తు అంధకారం


డ్రగ్స్‌పై నిర్వహించిన అవగాహన ర్యాలీలో పాల్గొన్న పోలీసులు, విద్యార్థులు

మిర్యాలగూడ అర్బన్: డ్రగ్స్ వాడితే బంగారు భవిష్యత్తు అంధకారం అవుతుందని, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని మిర్యాలగూడ డీఎస్పీ పి. వెంకటగిరి అన్నారు. సోమవారం అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పోలీస్ శాఖ, ఎక్సైజ్ పోలీసుల ఆధ్వర్యంలో 'సే నో టు డ్రగ్స్' పేరుతో విద్యార్థులతో కలిసి మిర్యాలగూడ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. విద్యార్థులు, యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఉన్నతమైన జీవితాన్ని గడపాలని అన్నారు. ఎవరైనా డ్రగ్స్ వాడుతున్నట్లు లేదా విక్రయిస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారమిచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో వన్‌టౌన్, టూటౌన్, రూరల్ సీఐలు రాఘవేందర్, నరసింహారావు, సత్యనారాయణ, ఎస్ఐలు శివతేజ్, నర్సింహులు, రామ్మూర్తి, ట్రాఫిక్ ఎస్ఐ కోటేష్, ఎక్సైజ్ పోలీసులు పాల్గొన్నారు.

విద్యతో ఉజ్వల భవిష్యత్తు సాధ్యం


కొంపెల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేస్తున్న పాండురంగారెడ్డి

తిరుమలగిరి(నాగార్జునసాగర్): విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి అన్నారు. సోమవారం తిరుమలగిరి మండలంలోని కొంపెల్లి, రంగుండ్ల, ఎల్లాపురం తండా, ఎల్లాపురం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు బుసిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాండురంగారెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ యడవెల్లి దిలీప్‌రెడ్డి, ఎంఈఓ తరి రాము, సర్పంచులు లీలావతికోట్యానాయక్, కాంసాని శ్రీనివాస్‌రెడ్డి, బిచ్యానాయక్, పమ్మి జనార్దన్‌రెడ్డి, శాగం శ్రవణ్‌కుమార్‌రెడ్డి, ప్రభావతీసం జీవరెడ్డి, ఉప సర్పంచులు మట్టపల్లి ప్రదీప్‌రెడ్డి, బాబురావునాయక్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి ఆర్థికసాయం..

తిరుమలగిరి మండలంలోని కొంపెల్లి గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థి ఇస్లావత్ శివ జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఓపెన్ కేటగిరీలో ఆలిండియా 983వ ర్యాంకు సాధించాడు. శివ ఉన్నత చదువులు చదివేందుకు గాను బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ పాండురంగారెడ్డి రూ.30వేలు ఆర్థికసాయం అందించారు.

కౌశిక్‌రెడ్డి మండలి సభ్యత్వం రద్దు చేయాలి


మిర్యాలగూడ అర్బన్: మాట్లాడుతున్న బంటు వెంకటేశ్వర్లు

మిర్యాలగూడ అర్బన్: హుజురాబాద్ నియోజకవర్గానికి చెందిన టీవీ జర్నలిస్టు బండి అజయ్ ముదిరాజ్‌పై ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, కౌశిక్‌రెడ్డి శాసన మండలి సభ్యత్వం రద్దు చేయడంతో పాటు ఆయనను అనర్హుడిగా ప్రకటించాలని బీసీ సంక్షేమ సంఘం మిర్యాలగూడ పట్టణ అధ్యక్షుడు బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్ డిమాండ్ చేశారు. సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో బీసీలపై దాడులు అధికమయ్యాయని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలు బీఆర్ఎస్ నాయకులకు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలో శివకుమార్, నవీన్, అంజి, వంశీ, వరప్రసాద్, మధు, శివకృష్ణ, బ్రహ్మం, సాయి, జగదీశ్ తదితరులున్నారు.

కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

చింతపల్లి: మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఐకి విన్నవించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం జిల్లా నాయకుడు చనమోని రాములు మాట్లాడుతూ.. కౌశిక్‌రెడ్డి ముదిరాజ్ కులస్తులపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శంకర్, పెద్దయ్య, శేఖర్, శ్రీశైలం, సైదులు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దదేవులపల్లిలో భగీరథ నీటి సరఫరాపై విచారణ


విచారణ చేస్తున్న ఎంపీఓ భిక్షం రాజ్

త్రిపురారం: మండలంలోని పెద్దదేవులపల్లి గ్రామంలో మిషన్ భగీరథ నీటి సరఫరాపై సోమవారం ఎంపీఓ భిక్షం రాజ్, మిషన్ భగీరథ ఏఈ మోహన్ గాంధీ విచారణ చేపట్టారు. గ్రామంలో భగీరథ నీరు సక్రమంగా అందడంలేదని గ్రామానికి చెందిన ఇరిగి క్రాంతి కుమార్, దామెర సంతోష్ ఇటీవల అదనపు కలెక్టర్ కుష్బూగుప్తాకు విన్నవించారు. దీనిపై విచారణ జరిపించాలని ఆమె జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఎంపీఓ భిక్షం రాజ్, మిషన్ భగీరథ ఏఈ మోహన్ గాంధీ గ్రామానికి చేరుకుని గ్రామంలోని మిషన్ భగీరథ ట్యాంక్‌లు, ఇంటికి వేసిన నల్లా కనెక్షన్‌లను పరిశీలించారు. నీరు ఎందుకు రావడం లేదని గ్రామస్తుల ఇళ్లకు వెళ్లి విచారణ చేశారు. పైపులైన్ లీకేజీలు ఎక్కువగా ఉండడం వల్ల నీరు సరిగ్గా సరఫరా కావడం లేదని, వచ్చే కాస్త నీటిలోనూ మురుగు నీరు కలుస్తుందని గ్రామస్తులు వారికి తెలిపారు. అనంతరం ఎంపీఓ మాట్లాడుతూ.. గ్రామస్తులు, పాలకవర్గ సభ్యుల నుంచి సేకరించిన సమాచారాన్ని జిల్లా అధికారులకు నివేదించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ టాకూర్ బాలరాణిబాయి, ఎంపీటీసీ అంబటి రాము, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు అంబటి సోమయ్య, ఉప సర్పంచ్ సింగం మంగవెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి రామయ్య, గుండెబోయిన వెంకటేశ్వర్లు, గుండెబోయిన రామయ్య, అంబటి శేఖర్, ఇరిగి కాంతి కుమార్, టాకూర్ రమేష్, వెంకటాచారి, కోటేష్ తదితరులు పాల్గొన్నారు.

కబ్జా కోరల్లో నీటికుంట చెరువు

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండలంలోని చింతలపాలెం రెవెన్యూ శివారులో సర్వే నంబర్ 52లో నాయకునితండా వద్ద గల నీటికుంట చెరువును అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు కబ్జా చేసి ఆక్రమించుకున్నట్లు గ్రామస్తులు ఆరోపించారు. సోమవారం కొందరు వ్యక్తులు జేసీబీతో చెరువును చదును చేసినట్లు పేర్కొన్నారు. ఇదే విషయమై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు. కబ్జాకు గురై చెరువు కనుమరుగయ్యే పరిస్థితి ఉందని పేర్కొన్నారు.


ఆక్రమణకు గురైన చెరువు

ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేస్తున్న కేసీఆర్


మిర్యాలగూడ టౌన్: తరగతులను బహిష్కరించి మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

మిర్యాలగూడ టౌన్: సీఎం కేసీఆర్ రాష్ట్రంలో కార్పొరేట్ విద్యాసంస్థలను అందలం ఎక్కిస్తూ ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతున్నారని ఏబీవీపీ నాయకులు ఆరోపించారు. ప్రభుత్వ విద్య పట్ల బీఆర్ఎస్ సర్కారు వైఖరిని నిరసిస్తూ సోమవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో మిర్యాలగూడ పట్టణంలోని ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో భారీ ర్యాలీ తీశారు. అనంతరం ఏబీవీపీ పట్టణ కార్యదర్శి రోమన్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలపై సీఎం కేసీఆర్ నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. మన ఊరు–మన బడి కార్యక్రమం కింద లక్షలాది రూపాయలు ఖర్చు చేసి ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దుతున్నామని ప్రభుత్వ చెబుతున్నా, చాలా ప్రాంతాల్లో నిధులు లేక పనులు నిలిచిపోతున్నాయని అన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని నియంత్రించాలని కోరారు. కార్యక్రమంలో కిరణ్, మహేష్, రమేష్, కీర్తి, మహేష్, సురేష్ తదితరులున్నారు.

దేవరకొండలో పాఠశాలల బంద్..

దేవరకొండ: విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో సోమవారం దేవరకొండ పట్టణంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో పాఠశాలల బంద్ నిర్వహించారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యలమల గోపిచంద్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నేత నీలయ్యకు నివాళి


నీలయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

చింతపల్లి: మండల కేంద్రానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు పులకరం నీలయ్య కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతిచెందారు. ఆయన భౌతికకాయానికి మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావుతో పాటు పలువురు సీపీఐ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నీలయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో సీపీఐ మండల కార్యదర్శి పోలె వెంకటయ్య, సహాయ కార్యదర్శి ఆరెకంటి రాధాకృష్ణ, వింజమూరి నర్సింహ, ఇద్ది రాములు, మొక్తాల పుల్లయ్య, వట్టికోటి శ్రీకాంత్, వెంకటేశ్ ఉన్నారు.

ఫీజు దందాను నియంత్రించాలి

అడవిదేవులపల్లి: ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దందాను ప్రభుత్వం నియంత్రించాలని ఎస్ఎఫ్ఐ సీనియర్ నేత కుర్ర శివనాయక్ డిమాండ్ చేశారు. సోమవారం అడవిదేవులపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలల్లో విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని అన్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలల గుర్తింపును తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీహెచ్. రాంబాబు, శివ తదితరులున్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ధర్నా


ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

మిర్యాలగూడ: పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ మాట్లాడుతూ.. గత ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అర్హులైన పేదలకు ఇళ్లతో పాటు ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చి నేటి వరకు ఇవ్వలేదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చకపోతే జూలై 3న అన్ని జిల్లాల కలెక్టరేట్ కార్యాలయాల ఎదుట పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రవినాయక్, సీఐటీయూ జిల్లా నాయకుడు మల్లు గౌతంరెడ్డి, నాయకులు తిరుపతి రామ్మూర్తి, బావండ్ల పాండు, యాదగిరి, దేశీరాం, రమేష్, పూలమ్మ, వినోద్‌నాయక్, మల్లయ్య, గోలి వెంకట్‌రెడ్డి, సోమయ్య, ఆశీర్వాదం, చారి తదితరులు పాల్గొన్నారు.

పార్కు భూమి కాపాడాలని వినతి

మిర్యాలగూడ టౌన్: పట్టణంలోని 3వ వార్డు తాళ్లగడ్డ ఇందిరమ్మ కాలనీలో 56, 57, 58, 59, 60, 519 సర్వే నంబర్లలో గల చెరువు శిఖం భూమిలో పార్కు భూమిని ఆక్రమించుకున్నారంటూ సోమవారం ముత్తిరెడ్డికుంటకు చెందిన విశ్వనాథుల రమేష్‌చారి నల్లగొండ కలెక్టరేట్‌లో వినతి పత్రం అందజేశారు. చెరువుకు శిఖం హద్దురాళ్లను తొలగించి అమ్ముతున్నారని, అన్యాక్రాంతమవుతున్న చెరువు శిఖం భూములను కాపాడాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

బోగస్ జాబితాను రద్దు చేయాలి

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండలంలోని నాగార్జునపేట తండాలో ప్రచురితమైన పోడు భూముల బోగస్ జాబితాను రద్దు చేసి, రీ సర్వే చేయాలని సోమవారం తండా రైతులు గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అటవీ అధికారులు నాగార్జునపేట తండా గ్రామపంచాయతీలో పోడు భూముల సర్వే నిర్వహించి అర్హుల పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేయకుండా అనర్హుల పేర్లను నమోదు చేశారని గ్రామస్తులు ఆరోపించారు. ఆన్‌లైన్ చేసిన వివరాలను గ్రామసభ ఏర్పాటు చేసి గ్రామస్తుల సమక్షంలో తెలపాల్సి ఉండగా, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్, గ్రామపంచాయతీ కార్యదర్శి తన సంతకాన్ని ఫోర్జరీ చేసి గ్రామసభ ఏర్పాటు చేసినట్లు సృష్టించారని సర్పంచ్ కనికి ఆరోపించారు. ప్రస్తుతం జాబితాలో ప్రచురితమైన 57 పేర్లను రద్దు చేసి తిరిగి రీ సర్వే నిర్వహించి సరైన లబ్ధిదారులకు పట్టాదారు పాసుపుస్తకాలు వచ్చే విధంగా చూడాలని అన్నారు. కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరినట్లు సర్పంచ్ కనికి పేర్కొన్నారు. వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని రెండు రోజుల క్రితం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సైతం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వమే స్థలం కేటాయించాలి


డిప్యూటీ తహసీల్దార్ శివశంకర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

మాడుగులపల్లి: పేదలకు ప్రభుత్వమే ఇళ్ల స్థలం కేటాయించి ఇళ్ల నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రొండి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం ఆ పార్టీ మండల నాయకులతో కలిసి ఈ మేరకు డిప్యూటీ తహసీల్దార్ శివశంకర్‌కు వినతి పత్రం అందజేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గృహలక్ష్మీ పథకం కింద అర్హులందరికీ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. రూ.3లక్షలు కేటాయిస్తే నిధులు సరిపోక పేదలు ఇబ్బంది పడే అవకాశముందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకుడు అశోక్‌రెడ్డి, సీపీఎం మండల కమిటీ సభ్యుడు వెంకటాచారి, ఐద్వా మండల కార్యదర్శి నాగమణి, గీత కార్మిక సంఘం మండల కార్యదర్శి విష్ణు, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


మిర్యాలగూడ టౌన్: తహసీల్దార్ అనిల్‌కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న పెన్షనర్లు

నిడమనూరు: రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం మండల నాయకులు సోమవారం నిడమనూరు తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రిటైర్డ్ ఉద్యోగులకు పూర్తిస్థాయిలో ఈహెచ్ఎస్‌ను అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లతో సమానంగా 2 డీఏలు ఇవ్వాలని, ఈ–కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించాలని, ప్రతి నెల మొదటి తేదీనే పెన్షన్ చెల్లించాలని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘానికి గుర్తింపు కల్పించాలని విన్నవించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు గుంటోజు అంజయ్య, ప్రధాన కార్యదర్శి కేఎస్ఎన్ రాజు, అంకయ్య, సైదులు తదితరులున్నారు.

దేవరకొండలో..

దేవరకొండ: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో దేవరకొండ ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం కార్యదర్శి అంకం చంద్రమౌళి మాట్లాడారు. వినతిపత్రం అందజేసిన వారిలో పంగునూరి లింగయ్య, కంచర్ల నారాయణరెడ్డి, గంగిడి దామోదర్‌రెడ్డి, ఐజాక్, యూసుఫ్ షరీఫ్, వనం బుచ్చయ్య, చెన్నయ్య, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడలో..

మిర్యాలగూడ టౌన్: రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం తెలంగాణ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మండల తహసీల్దార్ అనిల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. పెన్షనర్లకు ఒకటవ పీఆర్‌సీ సిఫారసులకు అనుగుణంగా మూల వేతనం నుంచి ఒక శాతం మినహాంచి పూర్తిస్థాయిలో ఈహెచ్ఎస్ అమలు చేయాలని కోరారు. అదేవిధంగా రెండో పీఆర్‌సీ కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం మిర్యాలగూడ అధ్యక్ష, కార్యదర్శులు బంటు శేషు, సుధాకర్‌రెడ్డి, కోశాధికారి ఎస్. వెంకట్‌రెడ్డిలతో పాటు పలువురు రిటైర్డ్ ఉద్యోగులు తదితరులున్నారు.

సంక్షిప్త సమాచారం

రేపు మండల సర్వసభ్య సమావేశం

త్రిపురారం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ అనుముల పాండమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అలివేలు మంగమ్మ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10.00 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులతో పాటు మండలస్థాయి అధికారులు తమ తమ నివేదికలతో హాజరుకావాలని సూచించారు.

అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమి పూజ

పెద్దఅడిశర్లపల్లి: మండలంలోని కోదండాపురం గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో బీఆర్ అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠాపనకు సోమవారం భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మైనం రాణి, ఎంపీటీసీ సంధ్య, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు దయాకర్, కళ్యాణ్, నవీన్, తరుణ్, నరేష్, శ్రావణ్ తదితరులున్నారు.

మానవత్వం చాటుకున్న హాలియా ఎస్ఐ

గుర్రంపోడు: మండలంలోని కొప్పోలు గ్రామానికి చెందిన కబడ్డీ క్రీడాకారుడు చింతల శంకర్ గతేడాది కబడ్డీ టోర్నమెంట్‌లో గాయపడ్డాడు. అప్పట్లో అతడి చేతికి డాక్టర్లు ఆపరేషన్ చేసి రాడ్‌లు వేశారు. కాగా ఇప్పుడు ఆ రాడ్‌లు తీయడానికి అయ్యే రూ.35వేల ఖర్చును తాను భరిస్తానని హాలియా ఎస్ఐ క్రాంతికుమార్ హామీ ఇచ్చారు. ఎస్ఐ క్రాంతికుమార్‌కు శంకర్ కుటుంబ సభ్యులు, కబడ్డీ క్రీడాకారులు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో గుర్రంపోడు ఎస్ఐగా పనిచేసిన క్రాంతికుమార్ ఈ ప్రాంతవాసులతో ఉన్న సత్సంబంధాలతో శంకర్‌కు సహాయమందించడానికి ముందుకు రావడం అభినందనీయమని పలువురు అన్నారు.

కాంగ్రెస్ పట్టణ ఉపాధ్యక్షుడిగా సికిందర్

మిర్యాలగూడ: కాంగ్రెస్ పార్టీ మిర్యాలగూడ పట్టణ ఉపాధ్యక్షుడిగా సికిందర్ ఎన్నికయ్యారు. ఈ మేరకు సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన నియామకపత్రం అందుకుని మాట్లాడారు. తన నియామకానికి సహకరించిన డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, పట్టణ పార్టీ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు పగిడి రామలింగయ్యయాదవ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలు, దేశిడి శేఖర్‌రెడ్డి, గంధం రామకృష్ణ, జాని, అజారుద్దీన్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఎన్నిక

కొండమల్లేపల్లి: మండల పరిధిలోని చింతకుంట్లలో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీని సోమవారం మహాజన సోషలిస్టు పార్టీ దేవరకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి మారుపాక గోపాల్‌మాదిగ, ఎమ్మార్పీఎస్ దేవరకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి పోతెం సహదేవుడు సమక్షంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పంది నగేశ్‌మాదిగ, ఉపాధ్యక్షుడిగా ఎదుల శ్రీనివాస్‌మాదిగ, ప్రధాన కార్యదర్శిగా అందుగుల శ్రీను, సహాయ కార్యదర్శిగా పంది చినముత్యాలు, అధికార ప్రతినిధిగా వస్కుల శ్రీనివాస్, కోశాధికారిగా ఎదుల బుచ్చయ్య, కార్యవర్గ సభ్యులుగా పంది అంజయ్య, మైనం శ్రీను, ఇద్దయ్య, వెంకటయ్య, పంది వెంకులు, పంది రాములు తదితరులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా ఇన్‌చార్జి ఆదెపు నాగరాజుమాదిగ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ పంది రుద్రమ్మశ్రీను, ఎదుళ్ల ఎల్లయ్యమాదిగ, అంకూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నోట్‌పుస్తకాలు అందజేత

వేములపల్లి: మండలంలోని మొల్కపట్నం గ్రామ ప్రాథమిక పాఠశాలలో కొత్తగా చేరిన విద్యార్థులకు సోమవారం బంజారా మహిళ ఎన్జీఓ ఫౌండర్ డాక్టర్ ఆనంద్, హరిప్రియ సంయుక్తంగా పలకలు, నోట్‌పుస్తకాలు, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులచే అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు తన వంతు కృషిచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సరస్వతి, ఈసీ గోపాల్, సుజాత తదితరులు పాల్గొన్నారు.